క్లుప్తంగా

ఆర్థిక సాయం

కడప కార్పొరేషన్: పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు, కడప జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ ఆధ్వర్యంలో 33వ డివిజన్‌లో పనిచేస్తున్న 25 మంది కార్మికులకు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా పవర్ అల్తాఫ్ మాట్లాడుతూ రంజాన్ పండుగను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నదే తమ ఉద్దేశ్యమని తెలిపారు.

నేటి నుంచి ఉరుసు

కడప కల్చరల్ : ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్ దర్గాలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఉరుసు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా దర్గాలోని హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా యదుల్లా మాలిక్ మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ ఉరుసు నిర్వహిస్తారు. బుధవారం గంధం ఉత్సవం, గురువారం ఉరుసు మహోత్సవం ఉంటాయి. శుక్రవారం తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారు.

నగరాభివృద్ధి కోసం సీపీఐ పోరుబాట

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరాభివృద్ధి కోసం సీపీఐ పోరుబాట చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎస్టీయూ కార్యాలయంలో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కొత్త జీవోలను తీసుకువచ్చి ప్రజలపై చెత్త, ఇంటి పన్నులు, యూజర్ చార్జీలను విధించడం దారుణమన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 30 వరకు నిర్వహిస్తున్న ప్రచార భేరిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దిలేటి, గంగా సురేష్, కెసీ బాదుల్లా, నాగరాజు, సావంత్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాగు భూమిని పంపిణీ చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో అర్హులైన పేదలకు సాగు భూమిని పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు సాగు భూమిని పంపిణీ చేసేందుకు అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించకపోవడం దారుణమన్నారు. జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా చర్యలు తీసుకోవాల్సిన తహశీల్దార్లు ఏమాత్రం పట్టించుకోకుండా కబ్జారాయులకు కొమ్ముకాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, వేణుగోపాల్, కెసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కార్పొరేట్ పాఠశాలలలో అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెట్టడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కార్పొరేట్ పాఠశాలలలో పని చేసే ఉపాధ్యాయులకు అడ్మిషన్ల పేరుతో టార్గెట్‌లు ఇస్తున్నారని తెలిపారు. కొత్త అడ్మిషన్లు చేర్పించకపోతే ఇంక్రిమెంట్‌లు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, విజయ్ పాల్గొన్నారు.

చదువుకు మించిన ఆస్తి లేదు



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కడపలోని సెయింట్ జోసెఫ్ బాలుర, బాలికల పాఠశాలతోపాటు ఆర్సీఎం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సమావేశమై భవిష్యత్తులో ఉన్నత స్థానాలు చేరుకోవడానికి విద్యార్థులకు ప్రేరణాత్మకమైన సందేశాన్ని ఇచ్చారు. చదువుతోపాటు ఆటలు, పాటలతోపాటు సంగీతం, సాహిత్యంపైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, సీఆర్పీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కరుణాకర్‌రెడ్డి సతీమణి రాజ్యలక్ష్మి మంగళవారం రూ.50,116ల విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ ముకుందారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, అర్చకులు దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, స్వామి చిత్ర పటం అందజేశారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

– మాసాపేటలో రూ.21.50 లక్షలతో మీడియన్ల నిర్మాణం



కడప నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు , చిత్రంలో కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మాసాపేట–కేసీ కాలువ వరకూ రోడ్డు మధ్యలో మీడియన్ల నిర్మాణాన్ని రూ.21.50 లక్షలతో చేపట్టే పనికి నగర పాలక స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ డివిజన్లోని పీఎస్ నగర్‌లో రూ.16.30 లక్షలతో చేపట్టిన పనికి సంబంధించిన టెండర్‌ను ఆమోదించారు. చిన్నచౌకులో సూర్య కాంప్లెక్స్ నుంచి సంజన్న సర్కిల్ వరకూ ఎడమ వైపున డ్రైన్ నిర్మాణం చేయుటకు రూ.28.50 లక్షలతో పిలిచిన టెండర్‌ను ఆమోదించారు. సెంట్రల్ జైలు కాంపౌండ్ వాల్ ప్రక్కన శ్రీరామ్ నగర్‌లో రూ.14.15లక్షలతో డ్రైన్ నిర్మాణం చేయుటకు అనుమతిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 8 తాగునీటి ట్యాంకులలో ఒక ఏడాదిపాటు క్లోరిన్ గ్యాస్ సరఫరా చేయడానికి నిర్వహించిన టెండర్లను ఆమోదించారు. సాయిపేటలో వాటర్ ట్యాంక్ మెట్లు రూ.15లక్షలతో నిర్మించడానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, హేమలత, మేసా ప్రమీల రాణి, ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్‌కుమార్, ఈఈ నారాయణస్వామి, ఎంహెచ్ఓ డా. ప్రశాంత్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీని వినియోగంలోకి తీసుకురావాలి



యూజీడీ ఎస్టీపీని పరిశీలిస్తున్న కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పాత, కొత్త సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎస్టీపీ పంప్‌హౌస్ పక్కనున్న డ్రైన్‌లను మరమ్మతులు చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాత ఎస్టీపీలో యూజీడీ వాటర్‌కు సంబంధించిన పాండ్స్ నింపాలని, పైపులైన్ మరమ్మతులు చేయాలని సూచించారు. నూతన ఎస్టీపీ వద్ద చేయాల్సిన పనులు, పైపులైన్లు, నిల్వ సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం సెంట్రల్ జైలు ప్రక్కనున్న శ్మశాన వాటికను పరిశీలించి, శ్మశాన స్థలాన్ని పూర్తిగా మార్కింగ్ వేయించాలన్నారు. శ్మశాన వాటికలో పాత్ వే ఏర్పాటు చేసి, మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ నారాయణస్వామి, డీఈ కరిముల్లాఖాన్, ఏఈ మణిగోపాల్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి బసివిరెడ్డి

కడప అర్బన్: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కడప అగ్నిమాపక కేంద్రం పరిధిలో గల గరీశా గ్యాస్ ఏజెన్సీ, ప్రసాద్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన సదస్సును గరీశా గ్యాస్ ఏజెన్సీ ఆవరణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి పి. బసివిరెడ్డి మాట్లాడుతూ గ్యాస్ వలన జరిగే ప్రమాదంను ఎలా అరికట్టాలో అవగాహన కలిగి వుండాలన్నారు. అగ్ని ప్రమాదాలే కాకుండా విపత్తులు సంభవించినప్పుడు తమ సహాయం కోసం సమాచారాన్ని వీలైనంత త్వరగా 101, 08562 242 299, 9963737191 నెంబర్‌లకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కడప అగ్నిమాపక సిబ్బంది, గరీశా గ్యాస్ ఏజెన్సీ యజమాని వెంకట రెడ్డి, సిబ్బంది, ప్రసాద్‌గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతి సంపద రక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప కల్చరల్ : మన పూర్వీకులు రక్షించి ఇచ్చిన సంపదను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవ సందర్భంగా మంగళవారం భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్), లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీల సహకారంతో నగరంలోని మహావీర్ మ్యూజియంలో సభ నిర్వహించారు. మన సొంత ఆస్తుల కంటే జాతి మనకిచ్చిన ఆస్తులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ ఎస్.ఎలియాస్‌రెడ్డి సభాధ్యక్షుడిగా మాట్లాడుతూ వారసత్వ కట్టడాల గురించి వివరించారు. లయన్స్‌క్లబ్ ఫాస్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి రాయలసీమలోని ప్రముఖ వారసత్వ కట్టడాల ఫోటోలను అతిథులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడుతూ కట్టడాలతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలు కూడా వారసత్వ సంపదలేనని, నేటి తరం వాటిని తమ సృజనతో ఈ సంపదను భావితరాలకు అందించాలని సూచించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం సమన్వయకర్త కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ సీమలో ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందని, తాను స్వయంగా తీసిన ఫోటోలతోసహా వివరించారు. లయన్స్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, గునిశెట్టి శ్రీనివాసులు, పుట్టా శ్రీరంగనాథ్, కరీముల్లా కూడా మాట్లాడారు.

నూతన కన్వీనర్ నియామకం

ఇంటాక్ వైఎస్సార్ జిల్లా చాప్టర్ నూతన కన్వీనర్‌గా లయన్ మానస చిన్నపరెడ్డిని కేంద్ర కమిటీ అనుమతితో నియమించామని ప్రస్తుత అధ్యక్షులు ఎస్.ఎలియాస్‌రెడ్డి అన్నారు. నూతన కో కన్వీనర్‌గా పీవీ సుబ్బారెడ్డిని నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వ పురుషుల కళాశాల, మున్సిపల్ మెయిన్, గాంధీనగర్ హైస్కూళ్లకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఎర్రముక్కపల్లె అమర వీరుల స్మారక స్థూపం వద్ద నుంచి వారతస్వ ర్యాలీని నిర్వహించారు. మహావీర్ సర్కిల్ మీదుగా మ్యూజియానికి చేరుకున్నాక అక్కడి శిల్పాలు, శాసనాల గురించి ఇంటాక్ సభ్యులు రాణి, పార్వతమ్మలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గొబ్బూరి కోటేశ్వరరావు, గౌరీశంకర్, కొండారెడ్డి, చిత్రకారులు వెంకటేశ్, మనీష్‌చౌదరి, ఎల్‌సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌ను పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దాలి



పాత కలెక్టరేట్‌ను చూపుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: పాత కలెక్టరేట్ కార్యాలయాన్ని పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దాలని పెన్షనర్ల సంఘం అసోసియేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, కార్యదర్శి రామమూర్తినాయుడు కోరారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాత కలెక్టరేట్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వ కాలం నుంచి జిల్లా కేంద్రం కడపలో అత్యంత ప్రతిష్టాత్మక కట్టడమైన పాత కలెక్టరేట్ నేడు కళా విహీనమైందన్నారు. ఒకనాడు అధికారులు, సమస్యలపై వచ్చే ప్రజానీకంతో కళకళలాడే కార్యాలయం నేడు నిరాదరణకు గురవుతోందన్నారు.

జిల్లా యంత్రాంగం సుందరమైన ఈ కట్టడాన్ని ఆధునీకరించి ప్రజలకు ఉపయోగపడే ఒక మంచి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభిమానులు రాయల్ కరీముల్లా, నాగేష్, నారాయణరెడ్డి, రాముడు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ట్రాఫిక్, పోలీసు అధికారులు

కడప ఎడ్యుకేషన్: ప్రతిఒక్కరూ తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అప్పుడే ప్రమాదాలను అరికట్టవచ్చని ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ సుబ్రమణ్యం అన్నారు. రాయల్ రసీద్ సంస్థ ముద్రించిన ట్రాఫిక్ రూల్స్ కరపత్రాలను మంగళవారం వారు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద ప్రజలకు, యువతకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు మోటార్ వాహనాలు ఇచ్చేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను పాలించేలా తెలియచేయాలన్నారు. అతివేగం ప్రమాదకరమని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసులు, వెంకటయ్యలు, రాయల్ రసీద్ సంస్థ ప్రతినిధి అబ్దుల్ రాయల్ కరీముల్లా, ఎన్‌సీసీ విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

రాహుకాల పూజలు



కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ వద్దగల శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి రాహుకాలంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక బృందం కార్యక్రమాన్ని క్రమంగా వివరిస్తూ వారితో పూజలు చేయించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌రావు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అరటికి ఈత ఆకు రక్ష

పులివెందుల రూరల్ : నల్లగొండువారిపల్లె, కొత్తపల్లె, మల్లికార్జునపురం గ్రామాల్లో అరటి రైతులు తాము సాగు చేసిన అరటి మొక్కలను ఎండ నుంచి రక్షించుకునేందుకు ఈత ఆకులను రక్షణగా వాడుతున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో వేడి నుంచి అరటి మొక్కలు దెబ్బతినకుండా ఉండేందుకు ఈత ఆకులను రక్షణగా ఏర్పాటు చేసుకున్నామని రైతులు చెబుతున్నారు. ఈత ఆకులను అనంతపురం జిల్లా ముదిగుబ్బ ప్రాంతాల నుంచి ఒక మొక్క రూ.2 నుంచి రూ.5లకు కొనుగోలు చేసి తీసుకొచ్చామని రైతులు తెలిపారు. అలాగే వివిధ రకాల జంతువుల బారి నుంచి కూడా అరటి మొక్కలను రక్షించుకునేందుకు ఈత ఆకులు శ్రీరామరక్షగా పనిచేస్తున్నాయని రైతులు తెలిపారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి, రంగనాథరెడ్డి

కడప కల్చరల్/ కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు పరీక్షల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం కడప నగరంలోని విద్యాసాగర్ హాస్పిటల్‌లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల ప్రవేశ పరీక్ష గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో భాగంగా ముక్కవారిపల్లె గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం సంఘం కార్యదర్శి డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆహ్లాదకరమైన వాతావరణం, సువిశాలమైన ప్రాంగణాలలో గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని బాలలకు ముక్కవారిపల్లెలో, బాలికలకు మైలవరం గురుకుల పాఠశాలలో 2023–24 సంవత్సరానికిగాను 5,6, 7, 8 తరగతులలో ప్రవేశానికి మే 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. దాని కోసం ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతోపాటు ఈ పరీక్ష ద్వారా శ్రీ సత్యసాయిజిల్లా కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ గురుకుల పాఠశాల విద్యార్థులు అనేక రంగాల్లో మంచి స్థాయిలో స్థిరపడ్డారని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నైతికత, విలువలతో కూడిన విద్యను బోధిస్తారని తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పేద, మధ్యతరగతి వారైన తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

– జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ యస్.కవిత

కడప ఎడ్యుకేషన్: మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం అని సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ యస్. కవిత అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలలో ‘మహిళల అక్రమ రవాణా– మాదక ద్రవ్యాల వినియోగం’ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని చట్టాలొచ్చినా ఇప్పటికీ చాలా దేశాల్లో మనుషుల అక్రమ రవాణా సాగుతూనే ఉందన్నారు. వెట్టిచాకిరి, లైగింక అవసరాల కోసం పురుషులు, మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారన్నారు. మహిళలు ఇటువంటి వారి గురించి అవగాహ కలిగి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం వలన యువత భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరికి బానిసగా మారుస్తుందన్నారు. డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా వెనకాడరన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా, వీటి చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు, స్టెప్, క్రీడా సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని ఎన్.పాలగిరి గ్రామంలో మంగళవారం నీటి యాజమాన్య సంస్థ కడప వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని గొర్రె కాపరులే కాకుండా పాడి రైతులు తమ పశువులను వైద్య శిబిరానికి తీసుకువచ్చారు. మండల పశు వైద్యాధికారులు సునీల్‌కుమార్‌రెడ్డి, సుస్మిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరంలో పాల్గొన్న పాడి రైతులు, గొర్రెల కాపరులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశు పోషణ యొక్క ఆవశ్యకత గురించి వైద్యాధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో నీటి యాజమాన్య సంస్థ పీఓ మద్దిలేటి, వాటర్‌షెడ్ చైర్మన్ రామమోహన్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌కు ఆదరణ

వల్లూరు : మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా సాగింది. వల్లూరులోని బీసీ కాలనీలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అర్హత వుండి ఇంకా ఏవైనా పథకాలు అందడం లేదా అని ఆరా తీశారు. అనంతరం వారి అనుమతితో గృహాల తలుపులకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బాలచంద్ర, పార్టీ నేతలు ప్రవీణ్, కరుణాకర్, చిట్టిబాబు, ఆనంద్, ప్రసాద్, విజయ్, వలంటీర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

సింహాద్రిపురం : మండల పరిధిలోని సుంకేసుల, రావులకొలను, గురిజాల గ్రామాల్లో హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చీనీలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ తోటల్లో ఎక్కువగా వేరుకుళ్లు, బంకు తెగులు సోకుతున్నాయని.. వీటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేరుకుళ్లు, బంకు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వాడుపట్టిన చీనీ చెట్లకు ఉన్నటువంటి కాయలను పీకి వేసి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

సరుకులు పంపిణీ



సరుకులను అందచేస్తున్న అబ్దుల్ షబ్బీర్

కడప ఎడ్యుకేషన్: పవిత్ర రంజాన్ మాసం షబే ఖదర్ పండుగను పురస్కరించుకుని మంగళవారం కడప ట్రంక్ రోడ్డులో ఉన్న మౌలానా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో సొసైటి అధ్యక్షుడు అబ్దుల్ షబ్బీర్ నిరుపేదలకు 22 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రంజాన్ పండుగను పురస్కరించుకుని నిరుపేద కుటుంబాలకు చేయూతనివ్వాలన్నారు. తమ తండ్రి రాయల్ రషీద్ జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించానన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి అధ్యక్షులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మలిదశ ఉద్యమ కార్యచరణలో భాగంగా మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించి సమస్యల పరిష్కారం కోసం నినదిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కో చైర్మన్ వసంత రాయల్, కడపజిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, కోవాధికారి రోనాల్డ్‌తోపాటు ఇతర నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

విద్యాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న ట్యూషన్ విద్యా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు సూచించారు. కడప నగర శివార్లలోని తారకరామనగర్‌లో ఏకలవ్య విద్య ట్యూషన్ కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం సందర్శించి విద్యార్థుల్లో భాషాపరమైన, గణిత, సాధారణ పరిజ్ఞాన సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ట్యూషన్ కేంద్రాలను సామాజిక సేవగా భావించి దాతలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యురాలు విజయలక్ష్మి, ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ నరేష్, ట్యూటర్స్ అఖిల, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.